నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, సోమవారం 29 జనవరి 2024 | RANGAREDDY

వన్యప్రాణులను రక్షించుకోవాలి..

వృక్షాలను పెంచి వన్య ప్రాణులను రక్షించుకోవాలి. దామగుండం ప్రాంతంలోని చెట్లను నరికి జీవరాసులను నశింప చేయొద్దు. ప్రాంతం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతించొద్దు. కరపత్రాల ద్వారా జనాలకు తెలియపర్చాలి.

– నర్సింహులు, అధ్యాపకుడు

ప్రాంత పరిరక్షణకు కృషి చేద్దాం..

వికారాబాద్ దామగుండం ప్రాంతాన్ని కాపాడేందుకు కృషి చేద్దాం. 2014లోనే నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ ప్రాంత ప్రజలు, జీవరాసులకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఆపివేశారు. 11 రాష్ట్రాల్లో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రతిపాదనలు ఇస్తే అక్కడి ప్రజలు వ్యతిరేకించడం వల్ల వికారాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఎంచుకున్నారు.

– దేవదాసు, వికారాబాద్

నేవీ రాడార్ మాకొద్దు..

ప్రజల ప్రాణాలే ముద్దు

ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- రాడార్ స్టేషన్ ఏర్పాటుతో జరిగే దుష్పరిణామాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తాం..
- నేవీ రాడార్ ఏర్పాటుపై 'ప్రకృతి విధ్వంసం-పరిణామాలపై' దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తొలి చర్చావేదిక
- స్వచ్ఛందంగా తరలివచ్చిన పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, ప్రకృతి ప్రేమికులు



ప్రకృతి విధ్వంసం-పరిణామాలు కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త, పాల్గొన్న మేధావులు, ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు

వికారాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రజలు, పక్షులు, జీవరాసుల ప్రాణాలను హరించే నేవీ రాడార్ స్టేషన్ మాకు వద్దని.. ప్రాణాలే ముద్దని మేధావులు, ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, స్పష్టం చేశారు. పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా సంఘటితమయ్యారు. తమ ప్రాంత భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పార్టీలకతీతంగా పోరాడుతామని తీర్మానించారు. దామగుండంలో నేవీ రాడార్ ఏర్పాటుపై దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రకృతి విధ్వంసం-పరిణామాలపై ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ బ్యాంకెట్ హాల్‌లో తొలి చర్చావేదిక జరిగింది. ఇందులో పలు తీర్మానాలు చేయడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటైతే చుట్టూ 7 కిలోమీటర్ల వరకు ఉన్న ఊర్లను ఖాళీ చేయాల్సి వస్తుందని.. 30 కిలోమీటర్ల మేర రేడియేషన్ ప్రభావం ఉండనున్న దృష్ట్యా రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా రేడియేషన్ ప్రభావంవల్ల పుట్టుకతోనే క్యాన్సర్ రావడం, మతిభ్రమించడం, గాలి, నీరు కలుషితం కావడం, మనుషులు రోగాల బారిన పడడం వంటి దుష్పరిణామాలను ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని.. కరపత్రాలను ముద్రించి ఊరూరా పంచాలని తీర్మానం చేశారు. అదే విధంగా ఒకరోజు జిల్లా బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు 5 వేల మంది విద్యార్థులతో మానవహారాన్ని నిర్మించి.. కలెక్టరేట్‌ను ముట్టడించి పాలనను స్తంభింపజేసి ప్రభుత్వానికి తెలిసే లా పోరాటం చేద్దామని కార్యాచరణను ప్రకటించారు. అరణ్యాలను అంతం చేసేలా ఈ ప్రాంతానికి అన్యాయం జరిగితే ప్రతి బిడ్డా తిరుగబడుతారని చర్చా వేదికగా హెచ్చరించారు. ఔషధ మొక్కలను నరకొద్దని రాజ్యాంగంలోనే ఉన్నదని.. వికారాబాద్ ప్రజలు చచ్చినా..బతికినా సంబంధం లేదన్నట్లుగా రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సమంజసం కాదని సూచించారు. రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే గాలి, నీరు కలుషితం అవుతుందని ప్రపంచ శాస్త్రవేత్తలు కూడా గుర్తించారన్నారు. లక్షల కోట్ల విలువైన ఔషధ మొక్కలు, 258 రకాల పక్షిజాతులున్న దామగుండం అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా రూ.కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటగా, ప్రస్తుత ప్రభుత్వం దట్టమైన అటవీని కాపాడకుండా నాశనం చేయడం సరికాదని తీర్మానించారు. ఈ చర్చావేదికలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌండ్ల నాగేందర్‌గౌడ్, దామగుండం అడవి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి రాజేందర్, ప్రకృతి ప్రేమికుడు సత్యానందస్వామి, ప్రొఫెసర్ అన్వర్, దేవనొనిగూడెం వెంకటయ్య, రిటైర్డ్ లెక్చరర్లు ముత్తారెడ్డి, నారాయణరావు, బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, తెలంగాణ ఉద్యమ వేదిక నాయకులు రామన్న, హైకోర్టు న్యాయవాదులు మేకల శ్రీనివాస్, రాము కాల్యాన్, రిటైర్డ్ టీచర్ సాయన్న, బీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య, దేవదాస్, పెద్ది అంజి, సీపీఎం నాయకులు నర్సింగ్‌రావు, మహిపాల్, రాజలింగం, రాఘవేందర్ గౌడ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్ల, పరిగికి రామన్న రాక

- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు..
- రంగారెడ్డిజిల్లాలో మొదటి సమావేశం చేవెళ్ల నుంచే శ్రీకారం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి.. వాస్తవాలను ముందుంచడమే లక్ష్యం
- సోమవారం చేవెళ్ల, పరిగి నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సమావేశాలు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న కేటీఆర్

షాబాద్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ నియోజవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి మొదటగా చేవెళ్ల నియోజకవర్గం నుంచి సమావేశాలను ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్, పరిగి పట్టణంలో నిర్వహించే సమావేశాలకు కేటీఆర్ హాజరై బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధం..

రంగారెడ్డి జిల్లాలో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా మూడు చోట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందింది. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నా.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర పార్టీలు చేసిన అసత్య ప్రచారాలను తిప్పికొట్టే విషయంలో పార్టీ శ్రేణులు కొంత వెనుకబడ్డాయి. తిరిగి ఆ పొరపాట్లు లోక్‌సభ ఎన్నికల్లో పునరావృత్తం కాకుండా కసరత్తు చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

నేడు చేవెళ్లలో సమావేశం..

లోక్‌సభ ఎన్నికలకు గులాబీ సైన్యాన్ని సన్నద్ధం చేసే దిశగా బీఆర్ఎస్ పార్టీ అడుగులు వేస్తున్నది. సోమవారం చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై, గులాబీ సైన్యానికి దిశానిర్దేశం చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీ మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు హాజరుకానున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

పరిగిలో..

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పరిగిలోని ఎస్ గార్డెన్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి కేటీఆర్ హాజరుకానున్నారు. సమావేశానికి అతిథులుగా పార్లమెంటు సభ్యులు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు హాజరవనున్నారు. ప్రతి మండలం నుంచి సుమారు వెయ్యి మంది వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ గ్రామ స్థాయిలోని అన్ని విభాగాల నాయకులు, బూత్ స్థాయి నాయకులు, మండల కమిటీల నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకానున్నారు.

ముప్పు తప్పదు..

నేవీ రాడార్ ఏర్పాటు చేస్తే దామగుండం అటవీ ప్రాంతంలో చాలా నష్టం జరుగుతుంది. గతంలో శివారెడ్డిపేట చెరువు ప్రాంతంలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామంటే .. ప్రజలు వ్యతిరేకించడంతో నిలిపి వేయడం జరిగింది. నేవీ రాడార్ వల్ల జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– ముత్తారెడ్డి, ఎస్ఏపీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు, వికారాబాద్

ప్రకృతికి నిజమైన శత్రువు మనిషి..

ప్రకృతికి నిజమైన శత్రువు మనిషే, ప్రకృతిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరం. ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, దామగుండం నేవీరాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయకుండా అడ్డుకునేందుకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అటవీ ప్రాంతాన్ని రక్షించుకోవడం ఎంతో అవసరం.

– నారాయణరావు, అధ్యాపకుడు, ఎస్ఏపీ కళాశాల, వికారాబాద్

జీవరాసులకు తీవ్ర నష్టం

వికారాబాద్ ప్రాంతం వెనుకబడడానికి కారణం పెద్దలే. నేవీ రాడార్ స్టేషన్‌ను దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఆ ప్రాంతంలో ప్రజలు, జంతువులు, పక్షులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రకృతి విధ్వంసాన్ని ఆపుదాం. కార్యాచరణ తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలి.

– పెద్ది అంజయ్య, బీఆర్ఎస్ నాయకుడు, వికారాబాద్

దామగుండాన్ని నాశనం చేయొద్దు..

దామగుండం అటవీ ప్రాంతంలో 20 గజాల ఎత్తుగల చెట్లు ఉండేవి. ఈ ప్రాంతంలో ఉన్న 500 నుంచి 600 మంది గడ్డి కోసేందుకు వెళ్లేవారు. నేవీరాడార్ ఏర్పాటు కోసం ఔషధ మూలికలు ఉన్న అడవిని నరికివేయడం సరికాదు. నేవీ రాడార్ ఏర్పాటు రద్దు చేయాలని ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందిద్దాం.

– రాజలింగం, సామాజికవేత్త, వికారాబాద్

వాతావరణం కలుషితం..

దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే వాతావరణం పూర్తిగా కలుషితం అవుతుంది. నేవీ రాడార్ ఏర్పాటును అడ్డుకుందాం. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వాట్సాప్, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేద్దాం. పార్టీలకతీతంగా ఏకం కావాలి.

– రాములు, బీఆర్ఎస్ పూడూరు మండలాధ్యక్షుడు

దట్టమైన అడవిగా పేరుంది..

85 ఏండ్లకు ముందు నుంచే దామగుండం ప్రాంతం దట్టమైన అటవీగా ఉన్నది. అక్కడ ఎన్నో రకాల జంతువులు, పక్షులు జీవిస్తున్నాయి. ఔషధ గుణాలు కలిగిన చెట్లు ఉండడంతో స్వచ్ఛమైన వాతావరణం ప్రజలకు అందుతున్నది. రామలింగేశ్వరాలయ ఏర్పాటుతో మరింత పేరుగాంచింది.

– సాయన్న, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యుడు

కలిసి కట్టుగా పోరాడుదాం

దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుదాం. ఆ కేంద్రం ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయని ప్రజలను ప్రభుత్వాలు మభ్యపెట్టడం సమంజసం కాదు. అటవీ ప్రాంతంలోని ఎన్నో ఔషధ మొక్కలు నాశనమవుతాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.

– రాఘవేందర్‌గౌడ్, పూడూరు

కేంద్ర మంత్రికి విన్నవిద్దాం..

దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్‌ను నిలిపి వేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేద్దాం. వికారాబాద్‌కు త్వరలో పీఎం నరేంద్రమోదీ వస్తున్నారు. నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం చేపట్టవద్దని కేంద్ర మంత్రి ద్వారా పీఎం దృష్టికి తీసుకెళ్దాం.

– మల్లేశ్ పటేల్, బీజేపీ నాయకుడు, పూడూరు

నేవీ రాడార్ ఏర్పాటు చేయవద్దు..

దామగుండం అటవీ ప్రాంతంలో నేవీరాడార్ ఏర్పాటు చేయవద్దు. భూమిలో కలుషితం ఏర్పడి రేడియేషన్ పెరిగి భూగర్భజలాలు, వృక్షాలు, పంటలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. నేవీ రాడార్ ఏర్పాటుకు సహకరించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వారి అనుచరులతో రూ.30వేలు అందజేశారు.

– సుజాత, పూడూరు మాజీ సభ్యురాలు

ఈ ప్రాంతం నష్టపోతుంది..

నేవీ రాడార్ ఏర్పాటు చేస్తే దామగుండం ప్రాంతంలో ఉన్న ప్రజలు నష్టపోతారు. సోమవారం పరిగి పట్టణంలో జరిగే సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రానున్నారు. నేవీ రాడార్ విషయంపై వినతి పత్రం అందజేసి వారి దృష్టికి తీసుకెళ్దాం. ప్రభుత్వానికి, కోర్టుకు ప్రాంత నష్టంపై వివరించాలి.

– రామన్న, రాష్ట్ర ఉద్యమ నాయకుడు

విస్తృతంగా ప్రచారం చేయాలి

పూడూరు ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు విషయంపై చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు కర పత్రాల ద్వారా, దండోరా వేసి, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా విస్తృతంగా సమాచారాన్ని విస్తరింపచేయాలి. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారాన్ని తెలియపర్చడం చాలా సులభం. అటవీ అభివృద్ధికి కృషి చేద్దాం.

– వెంకటయ్య, పూడూరు

పూర్తి మద్దతు ఇస్తాం

దామగుండం అటవీ ప్రాంతం అభివృద్ధికి సీఐటీయూ తరపున పూర్తి మద్దతు ఉంటుంది. నేవీ రాడార్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు నష్టం. పర్యావరణం కలుషితమై జీవరాసులు నశించిపోతాయి. రేడియేషన్ ద్వారా ఆ ప్రాంత ప్రజలు, చిన్నారులు సైతం వివిధ రకాల రోగాలతో ఇబ్బందులు పడుతారు.

– మహిపాల్, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, వికారాబాద్

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

రాడార్ కేంద్రం ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వాలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. ప్రజలకు హాని కలిగించే ఏ పనినైనా అడ్డుకుంటాం. గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఏ విధంగా ఉద్యమాలు చేశామో.. అదేవిధంగా దామగుండం అడవి పరిరక్షణ కోసం కూడా పార్టీలకతీతంగా ముందుకు వచ్చి సమష్టిగా పోరాడాలి.

– చంద్రయ్య, సీఐటీయూ, కొడంగల్

కలిసి ముందుకెళ్దాం..

నేవీ రాడార్ కేంద్ర ఏర్పాటును అడ్డుకునేందుకు కార్యాచరణతో అందరం కలిసి ముందుకెళ్దాం. ప్రజలు, పక్షులు, జీవరాసుల ప్రాణాలను కాపాడేందుకు చట్టపరంగా పోరాటం చేసి, అటవీ ప్రాంతాన్ని కాపాడుకుందాం.

– రాంచంద్రయ్య, బీఆర్ఎస్ నాయకుడు, పూడూరు

భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడేనా!

- జిల్లాలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల కబ్జా
- అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం విఫలం
- భూ దందాలపై కలెక్టర్ శశాంక సీరియస్
- ఇటీవల జరిగిన రెవెన్యూ అధికారుల సమీక్షలో తీవ్రస్థాయిలో చర్చ
- ఇకపై కఠినంగా వ్యవహరించాలని.. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించిన కలెక్టర్



రంగారెడ్డి, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : వడ్డించేవాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటీ ? అనేది పాత సామెత.. అధికారులు మనోళ్లు అయితే.. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నా.. వాటి జోలికెవరూ రారనేది కొత్త సామెత.. ప్రస్తుతం జిల్లాలో ఇదే తీరున అక్రమార్కుల భూ దందా సాగుతున్నది. జిల్లాలో ప్రభుత్వ భూ ఆక్రమణల పర్వం జోరుగా సాగుతున్నది. అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. అదీ మొక్కుబడిగా దాడులు చేయడం..

ఆ తర్వాత మిన్నకుండిపోతుండడం షరా మామూలైంది. ఇటీవల జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ శశాంక భూ ఆక్రమణలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. రెవెన్యూ అధికారులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలోనూ అధికారుల తీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది. ఇకపై కఠినంగా వ్యవహరించాలని, సైన్ బోర్డులు ఏర్పాటు చేసి సెంటు ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురి కాకుండా చూడాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

కబ్జాకు కాదేదీ అనర్హం..

జిల్లాలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో మారుమూల ప్రాంతంలోనూ వంద గజాల స్థలం రూ.20లక్షల నుంచి రూ.కోట్లలో ధర పలుకుతున్నది. రేట్లు ఆకాశన్నంటడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు.. అసైన్డ్, భూదాన్, పొరంబోకు, అటవీ.. భూముల్లో కబ్జా కాండను సాగిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగా ఇప్పటికే రూ.కోట్ల విలువైన ఎన్నో భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంటున్నాయి.

మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, గోపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో భూములకు ఉన్న డిమాండ్ తరహాలోనే ఆక్రమణలు ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే బాగోతం. చాలా చోట్ల వీటి వెనుక కొంతమంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారుల అండదండలతో భూ దందా నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయిన చోట్ల జీపీ పర్మిషన్లతో అక్రమతంతును సాగిస్తున్నారు. పాత దస్తావేజులు ఉంటే చాలు అడ్డదారిన విద్యుత్తు మీటర్లు, ఇంటి నంబర్లు తెచ్చుకుని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఈ భూముల్లో రాత్రికి రాత్రే నిర్మాణాలు వెలుస్తున్నాయి. లే అవుట్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను సైతం చెర పడుతున్నారు.

భూ దందాలపై కలెక్టర్ నజర్..

మాడ్గుల మండలం గిరి కొత్తపల్లిరంగ సముద్రం చెరువు, కందుకూరు డివిజన్ పరిధిలోని చందన చెరువు ఆక్రమణలపై, బాలాపూర్ మండలం కుర్మల్ గూడలో ప్రభుత్వ భూముల కబ్జాలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ శశాంక జిల్లాలో జరుగుతున్న భూ దందాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లాలో జరుగుతున్న భూ ఆక్రమణలపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది.

ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో నిర్లిప్తత ప్రదర్శించడంపై బాలాపూర్ తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయంగా జరగాలని, కబ్జాదారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ ప్రభుత్వ భూములను గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. విలువైన భూములు ఉన్న చోట అవసరమైతే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిసింది. ఎంతటివారు ఉన్నప్పటికీ ఉపేక్షించవద్దని, ఇకపై ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగితే..రెవెన్యూ అధికారులనే బాధ్యులను చేస్తానంటూ హెచ్చరించినట్లు సమాచారం.

జీవో 59 క్రమబద్ధీకరణపై ఆంక్షలు..

జీవో 59 కింద ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి జారీ చేసిన పట్టాల్లో జిల్లాలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 2023 ఆగస్టు 17 నుంచి జారీ చేసిన జీవో 59 పట్టాలకు సంబంధించిన నిర్మాణాలు, లే అవుట్లకు అనుమతులు ఇవ్వవద్దంటూ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలను సీసీఎల్ఏ ఆంతర్గత ఆదేశాలను జారీ చేసింది.

బడా నేతలతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు సైతం విలువైన ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి రూ.కోట్ల విలువజేసే భూములను సొంతం చేసుకున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం అక్రమార్కుల్లో గుబులు రేపుతున్నది.